క్లుప్తంగా

తల్లిదండ్రులదే కీలక బాధ్యత



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు, విద్యార్థులు

విజయనగరం క్రైమ్: యువత పెడదారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి. మధుకుమార్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడితే జీవితం సర్వనాశనమవుతుందన్నారు. డ్రగ్స్ రవాణాపై ఎటువంటి సమాచారం తెలిసినా టోల్ ఫ్రీ నంబర్ 14500 కి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ అధికారులు గంగాధరుడు, వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో బుధవారం నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ బాలాజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 110 మంది వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి త్రివేణి, సీనియర్ నేతలు నడిపేన ఆనంద్, గుర్నాథరావు, విభీషణరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య, సెక్యూరిటీ గార్డుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు ప్రభుత్వం జీతాలు పెంచుతూ ఇచ్చిన జీఓను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు బుధవారం స్థానిక కేంద్రాస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కరోనా సమయంలో కూడా ప్రాణాలు పణంగా పెట్టి పనిచేశామన్నారు. కార్యక్రమంలో బుగత అశోక్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ



మహిళలకు మొక్కలను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు మునగ మొక్కలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ క్రాంతిపథం, ఉపాధిహామీ పథకం సంయుక్త ఆధ్వర్యంలో మునగ మొక్కలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో వైకేపీ ఎంపీపీ అంబళ్ల సుధారాణి, ఎంపీడీఓ జి. గిరిబాల, తహసీల్దార్ కేవీ రమణరాజు, ఉపాధిహామీ ఏపీఓ అరుణ, వైకేపీ ఏపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం



రైతులతో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

పూసపాటిరేగ: రామతీర్థసాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువ నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలని పలువురు రైతులు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను కోరారు. మండల కేంద్రమైన పూసపాటిరేగలో రామతీర్థసాగర్ రిజర్వాయర్ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో జేసీ బుధవారం సమావేశమయ్యారు. మార్కెట్ ధర ఎకరానికి కోటి రుపాయలకు పైగా ఉన్నప్పటికీ, కేవలం రూ. 15 లక్షలు ఇస్తామనడం సబబు కాదని రైతులు మహంతి జనార్థనరావు, తదితరులు అనానరు. దీనికి జేసీ స్పందిస్తూ ధర విషయమై ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ ఇ.భాస్కరరావు, తదితరులున్నారు.

బాబు పాలనలో కానరాని సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ పథకాలు
- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



లబ్ధిదారుకు పింఛన్ పత్రం,నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల: గత టీడీపీ పాలనలో చావు కేకలే తప్ప సంక్షేమం కానరాలేదని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) అన్నారు. కొత్త పెన్షనదారులకు మండల కేంద్రంలో బుధవారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే అజెండాగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం సామాజిక పింఛన్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని 2,750 రూపాయలకు పెంచారని చెప్పారు. పింఛన్ సొమ్ము పెంపుతో అవ్వా,తాతల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. రానున్న ఎన్నికల నాటికి పింఛన్ మొత్తం మూడు వేల రూపాయలకు పెరుగుతుందని చెప్పారు. మండలానికి కొత్తగా 262 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని... కాని నేటి ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ పింఛన్లతో పాటు సంక్షేమ పథకాలన్నీ మంజూరవుతున్నట్లు తెలిపారు. చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన ఖర్మ అని కందుకూరులో 8 మందిని, గుంటూరులో ముగ్గురిని పొట్టనబెట్టుకున్నారని ఆరోపించారు. త్వరలోనే విశాఖను పరిపాలనా రాజధానికి మార్చడం తథ్యమన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ, మండలంలో 8,657 మందికి సంక్షేమ పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆడిట్ నిర్వహించి, కేవలం అర్హత లేని 11 మంది పింఛన్లను తొలగిస్తే ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని ఆరోపించారు. సీఎం గొప్ప మానవతావాదని, మూడేళ్లలో రూ. 1.9 లక్షల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందజేశారని చెప్పారు. చంద్రబాబు మాటలు నమ్మి, ఎవరూ మోసపోవద్దన్నారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, సతివాడ, కొండవెలగాడ పీఏసీఎస్ అధ్యక్షులు చనమల్లు వెంకటరమణ, రేగాన శ్రీనివాసరావు, ఎంపీడీఓ జి. గిరిబాల, తహసీల్దార్ కేవీ రమణరాజు, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

మండలానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లో గుర్తించిన సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా సమస్యలను అధికారులు నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. రబీ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు రాయితీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు. ఆయిల్ పామ్ తోటల పెంపకానికి సంబంధించి మొక్కల కొనుగోలుకు పూర్తి రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే కూరగాయల సాగుకు పందిర్లు వేసుకోవడానికి హెక్టారుకు రూ. 17,500 రాయితీగా ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని సతివాడ, కొండవెలగాడ పీహెచ్‌సీల్లో మళ్లీ కోవిడ్ టెస్టులు ప్రారంభించామని ఆయా ఆస్పత్రుల వైద్యాధికారులు చెప్పారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలోని 28 పంచాయతీల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి ప్రభుత్వం రూ. 25.18 కోట్లు మంజూరు చేసిందని గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈఈ వైకుంఠం నాయుడు చెప్పారు. పారసాం, టెక్కలి, రామతీర్థం, బర్లపేట, తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ కేవీ రమణరాజు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, సతివాడ, కొండవెలగాడ పీఏసీఎస్ అధ్యక్షులు చనమల్లు వెంకటరమణ, కోట్ల పైడినాయుడు, ఏపీ టూరిజమ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఎంపీడీఓ జి. గిరిబాల, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించేలా రంగోలి

- మైత్రీమీడియా ప్రతినిధులు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అవనాపు విక్రమ్, తదితరులు

విజయనగరం టౌన్: మన సంస్కృతీ, సంప్రదాయాల ఔన్నత్యాన్ని భావితరాలకు తెలియజేసే గురుతర బాధ్యతను మైత్రీ మీడియా తీసుకుందని సంస్థ యాజమాన్య ప్రతినిధి అవనాపు విక్రమ్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ ఏడాది ప్రేక్షకుల కోసం పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు . కోట జంక్షన్ వద్దనున్న కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 10న గురజాడ కళాక్షేత్రంలో రంగోలి పోటీలు, అలాగే చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకులకు అతి తక్కువ ధరకే నాణ్యమైన ఇంటర్‌నెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు . అనంతరం క్రిస్మస్, న్యూఇయర్ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ట్రెజర్ హంట్ పోటీ విజేతలను ప్రకటించారు. అలాగే రంగోలి పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైత్రీ మీడియా డైరెక్టర్ ముదునూరు సాయి నకుల్ వర్మ, ఆపరేటర్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



నూతన రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో ఆ స్థాయికి తగ్గట్లు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 43వ డివిజన్ ఉడాకాలనీ ఫేజ్–2లో రూ. 25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, నగరంలో నివసిస్తున్న ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ దాసరి సత్యవతి మాట్లాడుతూ, డివిజన్ ప్రజల కోరిక మేరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సహకరిస్తున్న కోలగట్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వింత ప్రభాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణప్పడు, పిన్నింటి సూర్యనారాయణ, వి.సురేష్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. మండలంలోని కవులవాడ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. అలాగే సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునే నూతన ఒరవడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అగుడులేస్తోందని, మూడున్నరేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అవినీతిరహిత పాలన అందించారన్నారు.

గత తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఎలా నిలిపివేయాలా అని ఆలోచించిందని, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం అర్హులందరినీ ఆదుకోవాలనే ఉద్దేశంతో ఎన్నో సంక్షేమ పథకాలు మంజూరు చేస్తోందని చెప్పారు. అనంతరం జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో రూ.33.80 లక్షల నిధులతో చేపట్టనున్న ఇంటింటికీ కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకరరెడ్డి, మత్స్యశాఖ డైరెక్టర్ నరసింహులు, సర్పంచ్ కొండపు ఎల్లయ్యమ్మ, కన్వీనర్ పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, కొండపు కొత్తయ్యరెడ్డి, దాట్ల శ్రీనివాసరాజు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల వెల్లువ..



విజయనగరం: ప్రజలు చెబుతున్న సమస్యలను వింటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 12వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలు మంజూరయ్యాయన్నారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు మాట్లాడుతూ, ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు అందించడం దేశ చరిత్రలో తొలిసారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ రేగాన రూపాదేవి, బొంగ భానుమూర్తి, నమ్మి గోపి, డొంకాడ పద్మావతి, స్పందన, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు ఆర్థిక సాయం



బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నెల్లిమర్ల:

పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో నివసిస్తున్న ముగ్గురు నిరుపేద చిన్నారులకు హైదరాబాద్‌కు చెందిన కారంకి ఫౌండేషన్ సమకూర్చిన లక్ష రూపాయలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు చేతులమీదుగా బుధవారం అందజేశారు. ప్రభుత్వం సదరు చిన్నారులు గంగ, చిన్నతల్లి, సరస్వతిని స్థానిక కేజీబీవీలో ఉంచి చదువు చెప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కారంకి ఫౌండేషన్‌కు సమకూర్చిన నగదును చిన్నారుల పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లు అందజేశారు. చిన్నారులను ఆదుకున్న ఫౌండేషన్ ప్రతినిధులు కేవీ శివనారాయణ, పిట్టా వెంకటరమణలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభినందించారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



ద్వారపూడిలో లబ్ధిదారునికి పెన్షన్ అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు

విజయనగరం రూరల్:

మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం పండుగలా నిర్వహించారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం నగదు అందజేశారు. ద్వారపూడి, సారిక, దుప్పాడ, తదితర గ్రామాల్లో పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. ద్వారపూడిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వృత్తి విద్య శిక్షణ



శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులతో డీపీఆర్‌ఓ రమేష్

నెల్లిమర్ల: స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో అందించిన వృత్తివిద్యా కోర్సు బుధవారంతో పూర్తయింది. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ కోర్సులో చేరిన 38 మంది మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణను సమాచారం పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం. మల్లేశ్వరరావు, సహాయ ఇంజినీర్ ఎ. శ్రీలక్ష్మి, తదితరులు రేడియో సర్క్యూట్‌లు, హై పవర్ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు, తదితర అంశాల్లో 15 రోజుల పాటు శిక్షణ అందించారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సమాచార పౌరసంబంధాల అధికారి డి. రమేష్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్ జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ సూచించారు. పట్టణంలోని వీటీ నగరంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణుల నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రమంతప్పకుండా గర్భిణులు వైద్య తనిఖీలు చేయించుకోవాలన్నారు. ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తినాలని తెలిపారు.

అంధుల ఆరాధ్యదైవం బ్రెయిలీ

- జిల్లా సహిత విద్య సమన్వయకర్త సూర్యారావు



పూసపాటిరేగ : మాట్లాడుతున్న ఎంఈఓ లలితకుమారి, తదితరులు



విజయనగరం: బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, భవిత కేంద్రం సిబ్బంది



విజయనగరం అర్బన్: లూయిస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం: అంధుల పాలిట ఆరాధ్యదైవం లూయిస్ బ్రెయిలీ అని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్. సూర్యారావు అన్నారు. బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక కల్యాణంద భారతీ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో దివ్యాంగుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దివ్యాంగ విద్యార్థులతో బ్రెయిలీ జయంతి నిర్వహించారు. అనంతరం సూర్యారావు మాట్లాడుతూ, బ్రెయిలీ లిపి ఎంతో మంది అంధుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ లిపి ద్వారా విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, సహిత విద్య ఉపాధ్యాయులు నడిపేన బంగారునాయుడు, ఎస్.ఈశ్వరరావు, పలువురు తల్లిదండ్రులు, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా..

విజయనగరం అర్బన్: అంధుల ఆరాధ్య దైవం సర్ లూయిస్ బ్రెయిలీ 214వ జయంతిని ఘనంగా జరిగింది. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిగ్రీ విద్యార్థి జి.వెంకటేష్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన లాప్‌ట్యాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జీవీబీ జగదీష్ మాట్లాడుతూ, బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగును నింపారని కొనియాడారు. ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ, 1809 జనవరి 4న జన్మించిన లూయిస్ బ్రెయిలీ తన 8వ ఏట కంటిచూపును కోల్పోయారని చెప్పారు. అప్పటి నుంచి అంధుల కోసం తన జీవితాన్ని అంకితం చేసి ఆరు చుక్కల బ్రెయిలీ లిపిని కనుగొన్నారని తెలిపారు. ప్రపంచంలో ఏ భాషకైనా అన్వయించేలా బ్రెయిలీ లిపిని రూపొందించిన ఘనత లూయిస్ మహనీయునికి దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అంధ ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.రాము, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సీహెచ్ ప్రదీప్ కుమార్, గాబ్రియేల్, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట ఆరాధ్య దైవమని మండల విద్యాశాఖ అధికారి పి. లలిత కుమారి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో జరిగిన జయంతిలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అంధుడైన కట్టా సింహాచలంను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు సుదర్శనరావు, సుజాత , వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.